ఓంశ్రీసాయిరాం

మేము 25వ తేదీని ఢిల్లీ చేరినప్పుడు ప్రజల ఉత్సాహము ఎంత తీవ్రముగా వుండినదంటే, ప్లేను నుంచి క్రిందికి దిగి వచ్చుటకే అర్ధగంట పట్టినది. ఢిల్లీలో ఒక నిముషముకూడా వ్యవధి లేకుండా లక్షలాది ప్రజలకు ఆనందమునందించే పనిలో నేను నిరతుడనైతిని. రాత్రింబవళ్ళు భజనలు జరిగినవి. ఆ సమయమున భక్తులకు దర్శనమిచ్చి, వారితో వచ్చిన రోగులకు ఆశీస్సులందించి తృప్తిపరచితిని.

ఉదయమునుంచి రాత్రి పన్నెండు గంటల వరకు రోడ్లు పూర్తి ఇసుక వేసిన రాలని రీతిగా జనులు కిక్కిరిసి యుండిరి. అయితే, 12 గంటల తరువాతకూడా క్రొత్త గుంపులు... జలంధర్, మీరట్, పాటియాలా, ఆగ్రా మొదలైన ఊళ్ళనుండి లెక్కలేనన్ని బస్సులలో వచ్చి, 'సాయిబాబా దర్శన్ దేవ్' అని ఆవేదనతో ఒకే అరుపు. రోడ్లంతా కారులతోను, బస్సులతోను నిండిపోయెను. కాబట్టి, వాళ్ళను నేను చూచి, వారికి దర్శనమిచ్చి రాకపోతే, వారి వెనుక నిల్చియున్న గుంపులకు ముందుకు వచ్చేందుకు చోటు లేదు. దానివలన నేను లోనుంచి మరిమరి వచ్చి వాళ్ళను ఆనందింపచేయవలసి వచ్చినది. ఈరీతిగా తెల్లవార్లు 3-30 వరకు జరిగినది. ఇంకేమి! బ్రహ్మముహూర్తమునకు నగర సంకీర్తనము ప్రారంభము కదా! పెద్ద పెద్ద గుంపులుగాలి మైళ్ళకొలది పొడవున రోడ్డుమీద భజన. ఢిల్లీ పూర్తి ఉఱ్ఱూతలూగినది. ప్రభుత్వములోని మినిష్టర్లకు,అధికారులకు, సామాన్యప్రజలకు, రిక్షాకూలీలకు, బీదలకు అందరికీ ఆనందమునందించి అనుగ్రహించటమైనది.

ఇట్లు, వారి ఆనందమును నేనందుకొంటూ, నా ఆనందమును వారందుకొంటూ వున్నప్పుడు, గుల్జారీలాల్‌నందా వచ్చి కురుక్షేత్రమున అఖిల భారత సాధుసమాజమువారు జరిపే ఒక మహాయజ్ఞమును స్వామి చేతులతోనే ప్రారంభించాలని గట్టిగా పట్టుపట్టాడు. ఇంత పెద్ద ప్రవాహముగా ఢిల్లీకి కొండంత ఆశతో వచ్చే భక్తజనులను వదలి వారిని నిరాశ పెట్టేది నా వలన కాదని నేను చెప్పినప్పుడు, వారితో వీరితో స్వామికి చెప్పించే ప్రయత్నమునకు పూనుకొన్నాడు. 'మీ రాజకీయములో రికమెండేషన్లకు చోటుండవచ్చునేగాని, నా భావమును, నా విషయమును సరిగా అర్థము చేసుకొన్న మీకే తెలియును. అట్లు రికమెండేషనులు వినేవాడినికాను నేను' అన్నాను. అయితే, ఆయన నాచేతనే ఆ యజ్ఞమునకు ప్రారంభోత్సవము జరిపించవలెనను పెద్ద ఆశ పెట్టుకొన్నాడని తెలిసినది. నా అనుగ్రహమునకు పాత్రుడు కావటము తనకొక అమితానందమును అందించే భాగ్యమని భావించాడు. తన సర్వస్వమును, సాధుసమాజమునకే త్యాగము చేయవలెననే మహోద్దేశముతో వున్నాడు కాబట్టి, ఆయనను సంతృప్తి పరచవలెనని సంకల్పించి, మధ్యాహ్నము రెండు గంటలకు ( ఆ మండుటెండలో, పైనా క్రింద మాడిపోవును కాబట్టి ఎవరూ ఎక్కువగా వేచి వుండరని, ఎక్కువ మందికి నిరాశ కలుగదని నిర్ణయించి) అచ్చటకు వెళ్ళాను.

కురుక్షేత్రము చేరితే ఎక్కడ చూచినా ఈ (సన్యాసి) కలరే. కాషాయవస్త్రధారులే! మూడు లక్షలకు పైగా ప్రజలు చేరియుండిరి. నాకేదో కొంత ఆనందము కలిగినది. ఆనందముతోబాటు వారికి కావలసిన ఆదేశములను అందించవలెననే ఉత్సాహముకూడా కలిగినది.

భారతదేశమును తలంచినప్పుడు హిమాచలము, దానినుండి ఉద్భవించు గంగయు జ్ఞప్తికి వచ్చును. సత్యధర్మప్రేమ అహింసలే హిమవత్ తత్త్వము. గంగయొక్క నిర్మల వాహినియే ప్రేమతత్త్వము. అట్టి నిశ్చలమైన హిమవత్ పర్వతమును, ఇట్టి నిర్మలమైన గంగాతత్త్వమును రాజకీయాల ద్వారా నాశనము చేయుటకు ప్రయత్నములు యెంత కాలము జరిగిననూ, ఎన్ని రకములుగా జరిగిననూ ఫలించవు అని వారికి ధైర్యము నందించితిని. లోన కషాయము పెట్టుకొని పైన కాషాయము ధరించిన ఏమీ ప్రయోజనముండదని హెచ్చరించితిని.

తరువాత ఒక దినము ఉత్తరప్రదేశ్ రాష్ట్రమందున్న మీరట్ నగరమునకు వెళ్ళియుంటిని. అక్కడకూడా యెవరిక తెలుపక, పత్రికలలో వేయక వెళ్ళిననూ, చుట్టూ వృక్షములపై కొమ్మకొమ్మలకు కోటి చీమలు అన్నట్లు ఇరుప్రక్కల లక్షలాది ప్రజలు కూర్చొనిరి. వేదిక దగ్గరకు మేము నడచిపోవుటకే వీలులేని పరిస్థితి. మనవాళ్ళందరూ తిరిగిపోవుటే మంచిదన్నారు. అయితే, నేను కారెక్కినప్పుడు ఆ భక్తుల రోదనము విని నేను దిగి జనసందడిలో దూరి ఒక్కడినే యెవరికీ తెలియకుండా వేదిక ఎక్కి దర్శనమిచ్చితిని. కొన్ని భజన పాటలతో వారిని శాంతపరచితిని.

'ఈ ఇరువదవ శతాబ్దమున భారతదేశపు రాజధానియూ, నవనాకరికతయొక్క కేంద్రస్థానమూ అయిన ఢిల్లీలో ఈ ఐదడుగుల స్వామిని దర్శించే కొరకు ఐదు లక్షలమంది చేరారంటే నిజముగా భారతదేశములో ఆధాత్మికపిపాస, ఆధ్యాత్మిక ఆవేదన, ఆధ్యాత్మికతృష్ణ మిక్కిలి తీవ్రముగా సజీవముగానున్నదని నేను తెలుసుకొన్నాను' అని అమెరికన్ అంబాసిడర్ కెనెత్ కీటింగ్ గారు సంతోషించి పలికిరి.

దైవభక్తి, ఆధ్యాత్మిక శ్రద్ధ భారతీయుల రక్తమున చేరి శతాబ్దములనుంచి సతతము ప్రవహించుచునే వున్నదని నాకు తెలియును. ప్రేమదృష్టి, ప్రేమపలుకులు, ప్రేమవృష్టి వీటికి అపజయమనేదే లేదు. రాదు. నాకెక్కడనూ దిగ్విజయమే! ఎందుకనగా అందరూ నావారే. నాకు పరాయివారే లేరు.